ప్రజాశక్తి
ఆదివారం 29 అక్టోబర్ 2023
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి





శతాబ్ది పైలాన్ ఆవిష్కరణ



పైలాన్ ఆవిష్కరణలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, గవర్నర్ నజీర్ తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ

ఆంధ్ర వైద్య కళాశాలలో శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ను భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ శనివారం ఆవిష్కరించారు. శుక్రవారం ప్రారంభమైన ఆంధ్ర మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు శనివారం ఉపరాష్ట్రపతి విశాఖ వచ్చారు. ఐఎన్‌ఎస్ డేగాలో ఉపరాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని పుష్పగుచ్ఛాలను అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉపరాష్ట్రపతి ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలకు హాజరయ్యారు. శతాబ్ది ఉత్సవాలకు గుర్తుగా వైద్య కళాశాల ఆవరణలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ మొక్కలు నాటారు. అనంతరం ఆంధ్ర వైద్య కళాశాల పానగల్ బిల్డింగులో వైద్య కళాశాల చరిత్ర, సాధించిన విజయాలకు సంబంధించి ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆంధ్ర వైద్య కళాశాలలో చదువుకొని దేశ, విదేశాలలో పేరు ప్రఖ్యాతలు గడించిన పూర్వ విద్యార్థులు, సీనియర్ వైద్యులు 38 మందితో భారత

ఎఎంసి ఉత్సవాల్లో పాల్గొన్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కలిసి గ్రూపు ఫోటో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ, అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, సిఎం రమేష్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, డాక్టర్ పి.అశోక్‌కుమార్, డాక్టర్ బుచ్చిరాజు, జివిఎంసి కమిషనర్ సాయి కాంత్‌వర్మ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జి.సుభద్ర, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, డాక్టర్ శశి ప్రభ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకారం ఉన్న ఏకైక కళాశాల : గవర్నర్

హార్వర్డ్ మెడికల్ స్కూల్, నార్త్ కరోలినా యూనివర్శిటీ వంటి ప్రపంచ ప్రఖ్యాత వైద్య సంస్థలతో అంతర్జాతీయ సహకారాన్ని కలిగి ఉన్న రాష్ట్రంలోని ఏకైక వైద్య కళాశాలగా ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రత్యేకతను కలిగి ఉందని రాష్ట్ర గవర్నర్ అబ్దుర్ నజీర్ పేర్కొన్నారు. విశాఖపట్నం బీచ్‌రోడ్‌లోని ఏయు కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. వైద్యులతో

మిగతా 2లో..



ర్యాలీలో పాల్గొన్న ఆర్‌కెఎస్‌వి.కుమార్ తదితరులు

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎపి విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న 3800 మంది మీటర్ రీడర్ల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ శ్రీకాకుళం నుంచి బయలుదేరిన బైక్‌యాత్ర శనివారం విశాఖపట్నంలోని ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి కార్యాలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా మీటర్ రీడర్ల యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శివారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కారిస్తానని జగన్నమోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర సందర్భంగానూ, అసెంబ్లీలోనూ మాట్లాడారని తెలిపారు. తర్వాత అధికారం చేపట్టినా పరిష్కరించకపోవడం అన్యాయం అన్నారు. మీటర్ రీడర్లకు పీస్ రేటు రద్దు చేసి నెలవారీ జీతాలు చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, పని దినాల కుదింపును ఆపాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, దశల వారీగా అర్హతను బట్టి సంస్థలో విలీనం చేయాలని డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా మూడు బైక్‌యాత్రలు జరుగుతున్నాయన్నారు. శ్రీకాకుళం, అనంతపురం, కడపలో ప్రారంభమైన యాత్రలు 31వ తేదీన విజయవాడకు చేరుకుంటాయన్నారు. విజయవాడలో జరిగే సభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ బైక్‌యాత్ర ఉదయం విజయనగరం నుంచి విశాఖలోని మధురవాడ, ఇసుకతోట, సీతమ్మధార మీదుగా సిఎమ్‌డి ఆఫీస్ అనంతరం ఎస్‌ఇ ఆఫీస్ వరకు కొనసాగింది. ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి, ఎస్‌ఇ వినతి పత్రం అందించారు. ఈ బైక్ యాత్రలో యూనియన్ అధ్యక్షులు ఎల్.రామకృష్ణ, డి.క్రాంతికుమార్, నగేష్, గుప్తా, శ్రీనివాస్, సుభాన్, పోలారావు, శ్రీకాంత్, ఆర్.ఈశ్వరరావు, ముత్యాలరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం
▶ వార్త మెయిన్‌లో..

'స్టీల్' ఆసుపత్రి సమస్యలు పరిష్కరించాలి
▶ వార్త 4లో..

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ధర్నా
▶ వార్త 5లో..

జిరాయితీ భూముల్లో నేవీ గోడ కట్టడం అన్యాయం
▶ వార్త 5లో..

దేశ సంపదను రక్షించుకుందాం

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖ)

దేశ సంపదను రక్షించుకుందామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 989వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ టిపిపి, ఆర్‌ఇడి, పిఇఎం విభాగాల ప్రతినిధులు, కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ ప్రతినిధులు వరసాల శ్రీనివాస్, బి.మహేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అదాని వంటి వ్యాపారవేత్తలను ప్రోత్సహించడం ద్వారా నేడు ప్రజల సంపద ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎల్ఐసి, స్టేట్ బ్యాంక్‌లు అదాని సంస్థలలో భారీగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. దీని వల్ల దేశంలోని 64 కోట్ల ప్రజల ప్రజాధనంపై ఆందోళన నెలకొందన్నారు. ఇటువంటి సంస్థలకే విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టే ఉద్దేశంతోనే ప్రభుత్వం అడుగులు వేస్తోందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శేషగిరి, బిఎంఎల్ నాయుడు, బివి.సత్యనారాయణ, శివవర్మ, ఎస్.కృష్ణమూర్తి, కె భద్రరావు, మంత్రి గోపి, పి.నర్సింగరావు, ఇ.సన్యాసిరావు, కేశవరావు, ఫణిరాజు తదితరులు పాల్గొన్నారు.

938వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 938వ రోజుకు చేరాయి. దీక్షల్లో మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఈసరపు లక్ష్మి, ఎ.జగదీశ్వరి, పి.బృంద పాల్గొన్నారు.

సామాజిక తరగతులకు సమన్యాయం

సాధికార సభలో మంత్రుల ఉద్ఘాటన

ప్రజాశక్తి- తగరపువలస : ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ తరగతులకు అన్ని విధాలా సమన్యాయం దక్కిందని పలువురు మంత్రులు ఉద్ఘాటించారు. చిట్టివలస ఫుట్ బాల్ గ్రౌండ్‌లో శనివారం సాయంత్రం వైసిపి ఆధ్వర్యాన చేపట్టిన సామాజిక సాధికార యాత్ర తగరపువలస చేరుకుంది. ఈ సందర్భంగా చిట్టివలస ఫుట్ బాల్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు మాట్లాడుతూ, మత్స్యకారులు, నాయీ బ్రాహ్మణులు గతంలో ఒకానొక సందర్భంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరుష పద జాలంతో తూలనాడిన మాటలను ఇప్పటికీ మర్చిపోలేరని గుర్తు చేశారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో బిసిలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు లభించిందని స్పష్టం చేశారు.

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో 136 వెనుక బడిన తరగతులను గుర్తించి 36 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, పాలక వర్గాలను నియమించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కులం, ప్రాంతం, పార్టీ చూడకుండా

మిగతా 2లో..

ప్రజలను మోసం చేసేందుకే వైసిపి బస్సు యాత్ర : పల్లా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజలను మోసం చెయ్యడానికే వైసిపి బస్సు యాత్ర అని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం జిల్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్రతో ప్రజల గొంతు కోసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సామాజిక న్యాయం చేయని జగన్ ఎన్నికల కోసం బస్సు యాత్ర పేరుతో కుట్ర పన్నారని విమర్శించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలను తొక్కిపెట్టి, పెత్తందారులు, పేదవానికి మధ్య పోరాటం అంటూ ముఖ్యమంత్రి ప్రకటన చేయటం సిగ్గుచేటన్నారు. కార్పొరేషన్లు పెట్టి, నిధులు, కార్యాలయాలు లేకుండా అన్ని వర్గాలను, అందరినీ మోసం చేశారన్నారు. అంతకుముందు తెలుగుదేశం నేతలు సిఎం జగన్‌కు వ్యతిరేకంగా రూపొందించిన పోస్టర్‌ను ఆయన అవిష్కరించారు. సమావేశంలో పార్టీ జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, నాయకులు ఎర్నాకుల జగదీశ్వరరావు, తమ్మిన విజయకుమార్, సర్వసిద్ధి అనంతలక్ష్మి, పొడుగు కుమార్, షేక్ రహీం తుల్లా, మహమ్మద్ గౌస్, గనగళ్ళ సత్య తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

శతాబ్ది పైలాన్ ఆవిష్కరణ

పాటు, నర్సింగ్, అనుబంధ ఆరోగ్య సేవలు, ఆసుపత్రి నిర్వహణ వంటి ఇతర భాగాలు కూడా ఆరోగ్య సంరక్షణ రంగం యొక్క పెరుగుతున్న అవసరాలను తీర్చడానికి సమాన వేగంతో వృద్ధి చెందాలన్నారు. ఇక్కడ చదివి ప్రపంచవ్యాప్తంగా ఉన్న 10,000 మందికిపైగా ఉన్న పూర్వ విద్యార్థులు వైద్య వృత్తికే కాకుండా పరిశోధన, పరిపాలన, వ్యవస్థాపకత, వివిధ కళారూపాలు, రక్షణ, విధాన రూపకల్పనలో గణనీయమైన కృషి చేయడం కళాశాలకు గర్వకారణం అన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం : మంత్రి రజని

'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' లక్ష్య సాధనలో తమ ప్రభుత్వం ఒక స్పష్టమైన వ్యూహాన్ని రూపొందించిందని, ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచడం ద్వారా ఆరోగ్య సంరక్షణలో అగ్రగామిగా నిలపడం కోసం కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య మంత్రి విడదల రజని చెప్పారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో మనం సాధించిన అద్భుతమైన పురోగతిని ప్రతిబింబించే విధంగా ఈ వేడుకలు నిర్వహించడం సంతోషకరం అన్నారు.

సామాజిక తరగతులకు సమన్యాయం

వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తుందన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ, దళితుల సంక్షేమానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయంగా సముచిత స్థానం కల్పించారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవివి.సత్య నారాయణ, ఎమ్మెల్సీలు వంశీ కృష్ణశ్రీనివాస్, వరుదు కల్యాణి, మేయర్ జి హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రఫీ మహమ్మద్‌కు ఎఎంపిపి ఇండియా అవార్డు



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అసోసియేషన్ ఫర్ మెటీరియల్స్, పెర్ఫార్మెన్స్ అండ్ ప్రొటెక్షన్ (ఎఎంపిపి) ఇండియా ఛాప్టర్ నుంచి 2023 సంవత్సరానికి గానూ డిస్టింక్షన్ ఇన్ కొరోషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవార్డును విశాఖ నగరానికి చెందిన డాక్టర్ రఫీ మహమ్మద్ అందుకున్నారు. కొరోషన్ సైన్స్ అండ్ టెక్నాలజీలో విద్య పరిశోధనలో గణనీయమైన కృషికి డాక్టర్ రఫీ ఈ అవార్డు అందుకున్నారు. ఆయన పీర్ రివ్యూడ్ ఇంటర్నేషనల్ జర్నల్స్/ప్రొసీడింగ్స్‌లో 25 కి పైగా కథనాలను, 50 కి పైగా పరిశోధన పత్రాలు ఇంటర్నేషనల్ / నేషనల్ కాన్ఫరెన్స్‌లలో సమర్పించారు. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి మెటలర్జికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్స్, మాస్టర్స్, పిహెచ్‌డి పట్టాలను డాక్టర్ రఫీ మహమ్మద్ పొందారు. ప్రస్తుతం, ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్ఐటిలో మెటలర్జికల్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, హెచ్ఒడిగా పని చేస్తున్నారు.

విశాఖలో కీడ కోలా చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రానా దగ్గుబాటి సమర్పణలో విజి సిన్మా బ్యానర్‌పై వివేక్ సుధన్సు, సాయి కృష్ణ గద్వాల్, ఉపేంద్ర వర్మ నిర్మాతలు డైరెక్టర్ తరుణ్ భాస్కర్ దాస్యం మూడో చిత్రంగా కీడ కోలా చిత్రం నవంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఎంవిపి కాలనీ గాది రాజు పాలెస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో చైతన్యరావు మదాడి మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ట్రయలర్, పాటలకు మంచి స్పందన వస్తుందన్నారు. డైరెక్టర్ తరుణ్ భాస్కర్ నుంచి మరో మంచి సినిమా వస్తుందని చెప్పారు. డార్క్ క్రైమ్ కామెడీ కథతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుందని, ఇప్పటి సినిమాలకు భిన్నంగా ఉండే ఈ సినిమా అమెరికాలో 400 స్క్రీన్ లలో విడుదల అవుతుందని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో నటులు రాగ మయూర్, విష్ణు పాల్గొన్నారు.

'ముగ్ధ' కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కాంచీపురం ముగ్ధలో అనుమానాస్పదంగా మృతిచెందిన కార్మికుని కుటుంబానికి న్యాయంచేయాలని సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విశాఖ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన కోర్టుకు ఎదురుగా ఉన్న ముగ్ధ షాపింగ్ మాల్ వద్ద వై.రాజు నేతృత్వంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ, ఈ ఏడాది ఏప్రిల్ 10వ తేదీన తమిళనాడు రాష్ట్రం కాంచీపురం ముగ్ధ బ్రాంచ్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్న మురళీకృష్ణ మృతిచెందాడని తెలిపారు. విశాఖలో ఉన్న అతని భార్యకు అదే రోజు అర్ధరాత్రి ఫోను రావడం, ఆమె అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించగా, రావద్దని యాజమాన్యం చెప్పారని పేర్కొన్నారు. కార్మికుని మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఆ కుటుంబానికి న్యాయం చేస్తామని యాజమాన్యం గత ఆరు నెలలుగా ఆశ పెడుతూ, ఇంతవరకూ పరిహారం చెల్లించకపోవడం అన్యాయం అన్నారు. సదరు యాజమాన్యం ఆ కార్మికునికి ఇఎస్ఐ కట్టకపోవడంతో ఆ కుటుంబానికి అన్యాయం జరిగిందని తెలిపారు. చట్ట ప్రకారం అతని వయస్సును బట్టి చూస్తే రూ.22.50 లక్షలు రావాల్సి ఉందని, యాజమాన్యం రూ.50 వేలు వేస్తామని చెప్పటం దుర్మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపిఎస్ చంద్రమౌళి, మత్స్యకారుల సంఘం నాయకులు కె.చంద్రశేఖర్, హోటల్ కార్మిక నాయకులు రామారావు, ఎర్రి బాబు, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కుటుంబ సమేతంగా చూసే సినిమా నరకాసుర



మీడియాతో మాట్లాడుతున్న హీరో రక్షిత్ తదితరులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సుముఖ క్రియేషన్స్ బ్యానర్‌పై పలాస ఫేమ్ రక్షిత్ హీరోగా అపర్ణ జనార్ధన్ హీరోయిన్‌గా నటించిన నరకాసుర చిత్ర యూనిట్ బృందం శనివారం విశాఖలో సందడి చేసింది. సినిమా ప్రమోషన్ టూర్లో భాగంగా సిరిపురంలోని హోటల్ వివానలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హీరో రక్షిత్

హీరో రక్షిత్

మాట్లాడుతూ, నరకాసుర సినిమా నవంబర్ మూడున ప్రేక్షకులు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. సాంఘిక ఇతివృత్తం మీద తీసిన ఈ సినిమాను కుటుంబ సమేతంగా చూడవచ్చన్నారు. గ్రామీణ నేపథ్యంలో నడిచే కథతో చిత్రం తెర కెక్కిందని తెలిపారు. హిందీ, తెలుగు, తమిళం కన్నడ, మలయాళం భాషలలో విడుదల అవుతుందని చెప్పారు. దర్శకుడు సెబాస్టియన్ మాట్లాడుతూ, పలాసను మించిన మూవీ ఇది అని చెప్పారు. రొటీన్ కథకు భిన్నంగా ఈ సినిమా ఉంటుందన్నారు. మధ్యప్రదేశ్, జబల్‌పూర్, లంబసింగి, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలలో షూటింగ్ చేసినట్లు తెలిపారు. దర్శకులు రాజమౌళి, గుణశేఖర్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన అనుభవంతో దర్శకుడినయ్యానని చెప్పారు. ఈ సమావేశంలో హీరోయిన్ అపర్ణ జనార్ధన్, సంకీర్తన పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గణేష్ కుమార్ అవినీతిపై పోస్టర్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు వ్యతిరేకంగా పలుచోట్ల పోస్టర్లు వెలిశాయి. శనివారం ఉదయం వెలుగు చూసిన పోస్టర్లు నియోజవర్గంలో కలకలం రేపాయి. డాబాగార్డెన్స్ మెయిన్ రోడ్, సరస్వతి పార్కు ప్రాంతాలలో పోస్టర్లు అతికించారు. ఎమ్మెల్యే గణేష్ కుమార్ టిడ్కో గృహాలను, నియోజవర్గంలోని దేవాలయాల చైర్మన్ల పోస్టులు, పార్టీలోని పదవులను అమ్ముకున్నారని పేర్కొంటూ పోస్టర్లు అంటించారు. 'బుక్ మై ఎమ్మెల్యే' క్యాప్షన్‌తో పోస్టర్లను అంటించిన సంగతి తెలియడంతో, ఎమ్మెల్యే అనుచరులు తొలగించారు. ఈ పోస్టర్ల వెనుక ఎవరి హస్తం ఉన్నదో తెలుసుకోవాలని పోలీసులను వాసుపల్లి కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

'ది సముద్ర ఆర్టిస్ట్ క్యాంప్' ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశ్వ సముద్ర గ్రూప్‌నకు చెందిన సెహర్‌తో కలిసి "ది సముద్ర ఆర్టిస్ట్ క్యాంప్" కార్యక్రమాన్ని శనివారం నోవాటెల్‌లో ప్రాంభించారు. నీటి సంరక్షణ, సుస్థిరత యొక్క ప్రాముఖ్యతను సూచించే విధంగా కళా ఖండాలని చిత్రీకరణ చేయనున్నారు. అందుకు గాను దేశవ్యాప్తంగా ఉన్న 20 మంది విశిష్ట చిత్రకారులను ఎంపిక చేశారు. వారిలో ఐదుగురు విశాఖపట్నం వారు ఉండటం విశేషం. ఈ చిత్రకులంతా కలిసి రానున్న 7 రోజులలో నీటి సంరక్షణ, సుస్థిరత యొక్క ప్రాముఖ్యతను సూచించే విధంగా పలు చిత్రాలను చిత్రించాల్సి ఉంది. ఈ చిత్రాలు నవంబర్ 3న వైజాగ్‌లో జరగనున్న 25వ ది ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ మీటింగ్‌లో ప్రదర్శించబడతాయి. ఈ సందర్భంగా విశ్వ సముద్ర గ్రూప్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ ప్రెసిడెంట్ కరణ్ మేడప్ప మాట్లాడుతూ, "వేగవంతమైన ఆర్థిక వృద్ధి, పెరుగుతున్న జనాభాతో, నీటి సంరక్షణ అవసరం గతంలో కంటే ఇప్పుడు



సుముద్ర గ్రూప్ సభ్యులు

చాలా క్లిష్టమైనదని చెప్పారు. సెహర్ వ్యవస్థాపకుడు సంజీవ్ భార్గవ మాట్లాడుతూ, సెహర్ ప్రాజెక్టల యొక్క ప్రధాన కార్యక్రమాలలో ఒకటిగా కళాకారుల శిబిరాలు నిలుస్తాయన్నారు. విజువల్ ఆర్ట్ ద్వారా శక్తివంతమైన సందేశాన్ని అందించడానికి ఇది ఒక మంచి వేదిక అవుతుందని తెలిపారు.

అభివృద్ధి కోసమే స్థాయీ సంఘం కృషి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : విశాఖ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందడానికి మాత్రమే జివిఎంసి స్థాయీ సంఘం కృషి చేస్తోందని స్థాయీ సంఘం సభ్యుడు ఊరుకూటి నారాయణరావు చెప్పారు. జివిఎంసిలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల కౌన్సిల్ సమావేశంలో 56 అంశాలు చర్చించిన తరువాతే ఆమోదించామని తెలిపారు. వేసవి క్రీడా శిబిరాల్లో నిధులు దుర్వినియోగ మయ్యాయని ప్రతిపక్షాలు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. క్రీడా పరికరాలు, వసతులు కల్పించామని చెప్పారు. గత కాంట్రాక్ట్ సంస్థలు మధ్యలో వదిలేసిన రోడ్లు ఇప్పుడు వేస్తున్నట్లు తెలిపారు. టిడిపీ, జనసేన కార్పొరేటర్లు చేస్తున్న ఆరోపణలు ప్రజలు నమ్మడం లేదని ఆయన స్పష్టం చేశారు.

నల్ల బెలూన్లతో టిడిపి నిరసన



చిన్న బజారు జంక్షన్ వద్ద నల్ల బెలూన్లతో టిడిపి నిరసన

ప్రజాశక్తి -భీమునిపట్నం : సామాజిక సాధికార బస్సు యాత్ర పేరుతో వైసిపి మరోసారి ప్రజలను మోసపుచ్చాలని ప్రయత్నిస్తోందని భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ఆరోపించారు. సామాజిక సాధికార బస్‌యాత్రను నిరసిస్తూ స్థానిక చిన్న బజారు జంక్షన్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో నల్ల రంగు బెలూన్ల తో శనివారం నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ, వైసిపి తలపెట్టిన యాత్ర ఓ బూటకమన్నారు. వైసిపి పాలనలో సామాజిక న్యాయం ఎక్కడ జరిగిందని, అన్నింటా ఒకే కులానికి ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోట్ని బాలాజీ, గంటా నూకరాజు, వానపల్లి సత్య, ఎం లక్ష్మణరావు, కె లీలావతి, పాసి నరసింగరావు పాల్గొన్నారు

ఇ-హుండీ ప్రారంభం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానంలో భక్తులు స్వామికి చెల్లించే కానుకలను ఆన్‌లైన్‌లో చెల్లించేలా ఈ హుండీని శనివారం దేవస్థానం ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. భక్తులు ఈ అవకాశాన్ని భక్తులందరూ వినియోగించుకుని, సింహాద్రి అప్పన్నకు కానుకలను చెల్లించాలని కోరారు.

150మందికి ఉచిత వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని కొవ్వాడ కుమ్మరిపేట వీధిలో శనివారం పద్మనాభం మండల గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో పద్మనాభానికి చెందిన జాన్‌విక్టర్ సహాయ సహకారాలతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, 150 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు రాలి అప్పారావు, సహయకుడు పొన్నాడ రామారావు, పాస్టర్లు అబ్రహం, కృపానందం పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-పద్మనాభం : వివిధ క్రీడల్లో పాఠశాల తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న మండలంలోని రేవిడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు 20మందికి గంటి ప్రవీణ్ సహకారంతో శనివారం పాఠశాల ప్రాంగణంలో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ, విద్యార్థులకు చేతనైన సాయం చేసేందుకు తాను ఎప్పుడూ ముందుంటానన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిహెచ్ రవికుమార్, ఆర్ శంకర్, కె సూరిబాబు,.బాపిరాజు, వీర్రాజు పాల్గొన్నారు.

ఎయు రిజిస్ట్రార్‌కు అభినందన

ప్రజాశక్తి- విశాఖపట్నం: ఆంధ్రవిశ్వ విద్యాలయం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను రాజ్యసభ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అభినందించారు. శనివారం రిజిస్ట్రార్‌ను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల అంబేద్కర్ విజన్‌పై పుస్తకాన్ని రచించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ, రిజిస్ట్రార్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య లక్ష్మీ ప్రసాద్‌కు రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్ పుస్తకాన్ని బహూకరించారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అభినందించారు. త్వరలో నాక్ కమిటీ వర్సిటీని సందర్శిస్తున్న నేపథ్యంలో వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలను సుందరంగా తీర్చిదిద్దడంలో తమవంతు భూమికను, బాధ్యతను విద్యార్థులు చేపట్టడం అభినందనీయమన్నారు. శనివారం కళాశాల ఆవరణలో పలుచోట్లకు రంగులు వేస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులను రిజిస్ట్రార్ అభినందించారు. రిజిస్ట్రార్‌తోపాటు ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణ రావు, డాక్టర్ ఎన్.ఎం యుగంధర్ పాల్గొన్నారు.

చంద్రంపాలెం పాఠశాలను మంత్రుల సందర్శన



పాఠశాల సందర్శనలో వైవి, మంత్రులు బొత్స,మేరుగు, సీదిరి

ప్రజాశక్తి- పిఎం పాలెం: వైసిపి సామాజిక సాధికార బస్సుయాత్రలో భాగంగా చంద్రంపాలెం జిల్లా పరిషత్ పాఠశాలను పలువురు మంత్రులు, వైసిపి ముఖ్యనేతలు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ తరగతి గదిలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి, పాఠశాలలో సౌకర్యాలపై ప్రశ్నించారు. విద్యాబోధనపై ఆరా తీశారు. పాఠశాలలో నాడునేడు పనులపైనా, విద్యార్థుల సామర్థ్యాలపై హెచ్‌ఎం ఎం రాజాబాబును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రులు మంత్రి మేరుగు నాగార్జున, సీదిరి అప్పలరాజు, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, వరుదు కళ్యాణి, జిల్లా పరిషత్ చైర్మన్ జె సుభద్ర, విశాఖ మేయర్ గోలగాని హరివెంకట కుమారి, నెడ్ క్యాప్ చైర్మన్ కెకె రాజు, పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మి ప్రియాంక, డిఇఒ ఎల్ చంద్రకళ పాల్గొన్నారు.

అమాత్యుల నిర్వాకంపై విద్యార్థుల నిరాశ

తమ పాఠశాల సందర్శనకు మంత్రుల బృందం వస్తుందన్న ఆనందంలో రాష్ట్రంలోనే అత్యధిక మంది విద్యార్థులున్న చంద్రంపాలెం పాఠశాలలో యాజమాన్యం, విద్యార్థులు ఎంతో శ్రమించి, వినూత్నంగా ఎంతో కష్టమైన 200 దేశాల నాణేలు కరెన్సీ నోట్లతో పిలాటెల్లి ప్రదర్శనను అద్భుతంగా ఏర్పాటు చేశారు. మంత్రులను ప్రదర్శన తిలకించేందుకు ఆహ్వానిస్తూ, ఇరువైపులా క్యూపద్ధతిలో విద్యార్థులు నిలబడ్డారు. అయితే మంత్రులు బృందం అటువైపు కనీసం కన్నెత్తి చూడకుండా వెళ్లిపోవడంపై విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మంత్రుల తీరుపై వైసిపి శ్రేణులు కూడా పెదవి విరిచారు. రోజుల తరబడి విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రమించి ప్రదర్శన ఏర్పాటు చేయడంతోపాటు, గంటల తరబడి ఎండలో నిలబడి స్వాగత సన్నాహాలు చేస్తే, ప్రదర్శనను చూసేందుకు కనీసం కనీసం కొద్దినిమిషాలు కేటాయించని వైసిపి నేతలు, మంత్రుల వైఖరిపై లోలోపల మదనపడుతూ, మండిపడుతున్నారు.

'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' జయప్రదం చేయండి

ప్రజాశక్తి -భీమునిపట్నం : వచ్చేనెల ఒకటి నుంచి 45 రోజుల పాటు నియోజకవర్గంలో నిర్వహించనున్న 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజక స్థాయి సమావేశంలో మాట్లాడుతూ, పార్టీసంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ఓటర్ల జాబితాలను ఒకటికి రెండుసార్లు పరిశీలన జరపాలని, అభ్యంతరాలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు,



మాట్లాడుతున్న రాజబాబు

నాయకులు వానపల్లి సత్య, గాడు అప్పలనాయుడు, సరగడ అప్పారావు, యరబాలఅనిల్ ప్రసాద్, పాసి నరసింగరావు పాల్గొన్నారు

టిడిపి గెలుపుతోనే వైసిపికి గుణపాఠం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి-గోపాలపట్నం : మరో నాలుగు నెలల్లో సాధారణ ఎన్నికలు రానున్నాయని, టిడిపి గెలుపుతోనే వైసిపికి గుణపాఠం చెప్పేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, వైసిపి కక్షపూరితంగా చంద్రబాబును అక్రమ అరెస్ట్ చేయడంపై బాబుతో నేను, అలాగే నిజం గెలవాలి కార్యక్రమాల ద్వారా జనంలోకి తీసుకువెళ్లాలని అన్నారు. ఓటర్ల జాబితాలను పరిశీలించి, కొత్తగా నమోదుతోపాటు టిడిపి సానుభూతిపరుల పేర్లు తొలగించకుండా అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. టిడిపి మేనిఫెస్టో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, మహాశక్తి వంటి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రంగనాయకులు, టిడిపి కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ, గల్లా చిన్న, నేతలు మౌర్య సింహ, నక్క లక్ష్మణరావు ,మళ్ల అప్పారావు, మళ్ల శంకరరావు, కొరడా శ్రీను, నందవరపు సోములు, పోలి రెడ్డి, నారిపిన్ని సత్తిరాజు, వైటిఆర్.వాసుదేవరావు , ప్రదీప్ , నీలపు జోజి, శ్రీలక్ష్మి, బొడ్డేటి విజయ్, రామ్మోహన్ నాయుడు, దాడి రమేష్ నాయుడు, బంగారు తులసిరామ్, పెంకోట అజయ్, నరవ పైడిరాజు, మత శ్రీను , మజ్జి సోమేష్ పాల్గొన్నారు.

ప్రి రిపబ్లిక్‌డే పరేడ్ శిక్షణకు ఎయు విద్యార్థులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ప్రి రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఐదుగురు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. శనివారం వీరిని తన చాంబర్‌లో విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అభినందించారు. ఎయు అనుబంధ కళాశాలకు చెందిన అఫ్రీన మీర్జా మహమ్మద్, కె.రచన, కె.కేదార్రీ, పి. హేమలత, ఎస్.కల్యాణి వచ్చేనెల ఒకటి నుంచి పదో తేదీవరకు విజయవాడ కె.ఎల్ యూనివర్సిటీలో జరిగే ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొంటారు. జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా జరిగే రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎయు విద్యార్థులు ఎంపికపై విసి హర్షం వ్యక్తం చేసి, విద్యార్థినులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎయు విసి ప్రసాదరెడ్డి

కార్యక్రమంలోకె.ఎల్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య పార్థసారధివర్మ, ఎయు ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బీటెక్ ఇంజనీర్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సిరిసోల జగన్ కుమార్ (22) ఇంటిలో ఫ్యానుకు ఉరివేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఫైనల్ ఇయర్‌లో సబ్జెక్టులు ఉండిపోయిన కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు తండ్రి ఈశ్వరరావు బెంగళూరులో ఆర్మీ ఉద్యోగి. తల్లి కుమారి గ్రామంలో పాన్ షాప్ నడుపుతుంది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నీటి సంప్‌లో బాలుడి మృతదేహం

ప్రజాశక్తి -గాజువాక : అపార్ట్‌మెంట్ నీటిసంపులో బాలుడి మృతదేహం లభ్యమైన ఘటన శనివారం గాజువాక, పంతులు గారి మేడలో కలకలం రేపింది. దీనికి సంబంధించి గాజువాక సిఐ భాస్కరరావు తెలిపిన వివరాలివి.

పంతులుగారిమేడ వద్ద ఒక అపార్టుమెంట్‌లో గొంతిని దొరబాబు, అతని భార్య మణి కొంతకాలంగా నివాసముంటున్నారు. వీరికి ఎనిమిదేళ్ల శంకర్, ఐదేళ్ల వేదాంత అనే ఇద్దరు కుమారులున్నారు. భార్యాభర్తల మధ్య గొడవ రావడంతో గతనెల 24న భార్య మణి అలిగి ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఆమెతోపాటు ఐదేళ్ల కొడుకు వేదాంతను తీసుకెళ్లిపోయి ఉంటుందని అందరూ భావించారు.

రెండు రోజులుగా అపార్టుమెంట్‌లో మంచినీరు దుర్వాసన వస్తుండడంతో శనివారం ఉదయం నీటిసంపును అపార్ట్‌మెంట్ వాసులు పరిశీలించగా, అందులో బాలుడి మృతదేహం కనిపించింది. బయటకు తీసి చూడగా వేదాంతగా గుర్తించారు.. ఘటనాస్థలానికి గాజువాక ఎసిపి త్రినాథ్, సిఐ భాస్కరరావు చేరుకుని, ఘటనపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి దుర్మార్గం

ప్రజాశక్తి -మధురవాడ : కావలిలో విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టిసి డ్రైవర్‌పై కొందరు దుండగులు దాడి చేసి గాయపరచడం దుర్మార్గపు చర్య అని జనసేన నాయకుడు బివి కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఆర్‌టిసి ఉద్యోగుల రక్షణ, భద్రతకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలని కోరారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు

ప్రజాశక్తి-పద్మనాభం : రబీ సీజన్‌లో చిరుధాన్యాల సాగుతో తక్కువ కాలంతో పరిమితమైన పెట్టుబడితో అధిక దిగుబడులు, లాభాలను సాధించవచ్చని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చదువుల సుబ్రమణ్యం అన్నారు. శనివారం మండలంలోని మద్ది గ్రామంలో చిరుదాన్యాల సాగు, ఆహారభద్రత పై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ ప్రాంతానికి అనువైన ఇంద్రావతి, వేగవతి, సువర్ణముఖి రకాల రాగుల వంగడాలను సాగుచేస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. విజయనగరం వ్యవసాయ పరిశోధనస్థానం నుంచి విత్తనాలను తెప్పించి, సిద్ధంగా ఉంచామన్నారు. అలాగే రైతులు పండించిన రాగులను ప్రభుత్వపరంగా కొనుగోలు చేస్తామన్నారు. ఎఎ ఎంవి.చలం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భీమిలి ఎడిఎ డాక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్, వ్యవసాయశాఖ సిబ్బంది శ్రీను, సురేష్, విజయకుమార్ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించిన ముత్తంశెట్టి

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను శనివారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్య నిర్వహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి ఆలయ సాంప్రదాయ ప్రకారం సాగరంగా స్వాగతం పలికారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా ఈవో శాలువాతో సత్కరించి స్వామి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందించారు.

వెండి ఆభరణాల అలంకరణ

సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో ఉన్న ప్రహ్లాదులు విగ్రహానికి సీనియర్ నటి రోజారమణి, పి ఎస్‌ఎన్.రాజు సమర్పించిన వెండి నామం, వెండి నేత్రం, వెండి పాదాలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో శనివారం అలంకరించారు.

దివీస్ నిధులతో ఐటిఐలో సౌకర్యాలు



విద్యార్థులకు వస్తువులను అందజేస్తున్న కుమార్‌రాజా

ప్రజాశక్తి -పిఎం పాలెం.: బక్కన్నపాలెం సమీపంలోని విభిన్న ప్రతిభావంతులు ఐటిఐలో దివిస్ సిఎస్‌ఆర్ నిధులు రూ.11.75లక్షలతో ఐటిఐలో అంతర్గత రోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు వయోవృద్ధుల సంక్షేమ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఎ.కుమార్‌రాజా శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఐటిఐ కేంద్రంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ మాధవి పర్యవేక్షణలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల ఐటిఐలో సౌకర్యాల కల్పనకు చేయూతనిచ్చిన దివీస్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ మాధవి, దివీస్ సిఎస్‌ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్, శిక్షణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక నమూనాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక సన్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆలోచింప జేసింది. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ప్రతి నమూనాలోనూ విద్యార్థుల సృజన ప్రస్ఫుటితమైంది. డ్రోన్, హైడ్రాలిక్ ఎలక్ట్రిసిటీ, స్మార్ట్ సిటీ, గ్రామీణ ప్రాంతం, ఆటో మేటిక్ స్ట్రీట్ లైట్లు, హైడ్రాలిక్ కార్ పార్కింగ్, ఎలక్ట్రికల్ మోటార్ బైక్, రిమోట్ కంట్రోల్ బోట్, సెవెన్ వండర్స్, సోలార్ రోబోట్ వంటి 230కి పైగా నమూనాలను ప్రదర్శించారు. సన్ స్కూల్ కరస్పాండెంట్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు మరింత పట్టుసాధించాలని ఆకాంక్షించారు.

చీఫ్ సిటీ ప్లానర్‌కు అభినందన



సిసిపి సురేష్‌ను అభినందిస్తున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్‌గా బాధ్యతలు చేపట్టిన బి సురేష్‌కుమార్‌ను జివిఎంసి సిసిపి చాంబర్‌లో శనివారం టౌన్ ప్లానింగ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు సారధ్యంలో పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, నగరాభివృద్ధిలో సురేష్ కుమార్ కృషి ఎనలేనిదన్నారు. అందరితో సమన్వయంతో పనిచేస్తారని, జి20 సదస్సు, ప్రెసిడెంట్ ఫ్లేట్ రివ్యూ, మాస్టర్ ప్లాన్ రూపకల్పన, బిపిఎస్‌తో పాటు అనేక రోడ్ల విస్తరణ కార్యక్రమాలు సురేష్ సారధ్యంలో బాధ్యతలు నిర్వహించామని గుర్తు చేశారు. అందర్నీ కలుపుకునిపోతూ, నిరంతరం శ్రమించే సురేష్, బదిలీ అయిన తక్కువ కాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం అతని సేవలను గుర్తించి మళ్లీ జివిఎంసిలో సిసిపిగా గుర్తించడం అభినందనీయమని కొనియాడారు. సురేష్‌కు టౌన్‌ప్లానింగ్ విభాగం పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు రమణ, వెంకటరావు, నాయుడు పాల్గొన్నారు.

'స్టీల్' ఆసుపత్రి సమస్యలను పరిష్కరించాలి



స్టీల్ వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. శనివారం జనరల్ హాస్పిటల్ విభాగాధిపతి డాక్టర్ ప్రకాష్‌ను ఆయన కార్యాలయంలో కలిసిన స్టీల్ సిఐటియు ప్రతినిధుల బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుల సంఖ్య తగ్గి ఉత్పత్తి పెరిగిన నేపథ్యంలో ఉన్న కార్మికులపై ఒత్తిడి పెరిగి, స్టీల్ కార్మికులు తీవ్రఒత్తిడికి గురవుతున్నారన్నారు.

దీంతో వారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువై ఆసుపత్రికి వెళితే, అక్కడ రోగ నిర్ధారణ పరీక్షలు, రోగికి కావలసిన మందులు అందుబాటులో లేవన్నారు. దీనికి పొంతన లేని కారణాలను చూపటం యాజమాన్యం నిర్లక్ష్యవైఖరికి నిదర్శనమన్నారు. వైద్య సేవలు మెరుగుపరిచేందుకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికి హాస్పిటల్ విభాగాధిపతి డాక్టర్ ప్రకాష్ స్పందిస్తూ, సమస్యలను ఉక్కు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళి, వారి ఆదేశాలు మేరకు రోగులకు సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ సారంగి, స్టీల్ సిఐటియు ప్రతినిధులు వైటి.దాస్, యు.రామస్వామి, టివికె రాజు, నీలకంఠం, గడ వెంకటేశ్వరరావు, అప్పలరాజు, యు వెంకటేశ్వర్లు, పుల్లారావు, పూర్ణచంద్రరావు, సిఐటియు హాస్పిటల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి : వైవి



సుబ్బారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వాటిని ఎదుర్కోవడానికి కార్యకర్తలు సిద్ధం కావాలని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం 65వ వార్డు వికాస్ నగర్‌లో గాజువాక నియోజవర్గ వైసిపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. వచ్చేనెల 6న పాత గాజువాకలో సామాజిక సాధికార బస్‌యాత్రను జయప్రదం చేయాలని కోరారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, గాజువాకలో హౌస్ కమిటీ సమస్య పరిష్కారం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రూ.88 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జివిఎంసి 65వ వార్డులో రూ.88 లక్షలతో చేపట్టనున్న రక్షణ గోడ నిర్మాణం, వికాస్ నగర్ సంక్షేమ సంఘం భవనం పునరుద్ధరణ పనులకు వైసిపి ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి తిప్పల దేవన్ రెడ్డి,కార్పొరేటర్ భూపతిరాజు సుజాత,దొడ్డి రమణ,పులి రాజారెడ్డి, లతీశ్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

పశువైద్యశాల ఏర్పాటుకు వినతి

జివిఎంసి 87వ వార్డు వడ్లపూడిలో పశు వైద్యశాల ఏర్పాటు చేయాలని అ వార్డు వైసిపి నేతలు కోరారు. ఈమేరకు శనివారం ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వైవిని కలిసిన వారిలో వైసిపి జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు, వార్డు కార్యదర్శి ముద్దపు దామోదర్, సచివాలయ కన్వీనర్ దుగ్గపు దానప్పలు, జగన్, బోండా గోవిందరాజులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో సన్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



శ్రీరామ్‌ను అభినంది స్తున్న శ్రీనివాస్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా, పరవాడ మండలం, ధర్మారాయుడుపేట జెడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన యోగా పోటీల్లో స్థానిక సన్ స్కూల్ విద్యార్థి జి శ్రీరామ్ మంచి ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కె శ్రీనివాస్ తెలిపారు. వచ్చేనెల 1నుంచి 3వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లా వీర వాసరం జెడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు శ్రీరామ్ ఎంపికపై హర్షం వ్యక్తం చేసి, అభినందించారు. యోగా టీచర్లను అభినందించారు

యువతలో పెరుగుతోన్న బ్రెయిన్ స్ట్రోక్స్

కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సిహెచ్ విజయ్



డాక్టర్ సిహెచ్ విజయ్

ప్రజాశక్తి- గాజువాక : మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, జన్యుపరమైన కారణాలతో వయసుతో సంబంధం లేకుండా యువతలో బ్రెయిన్ స్ట్రోక్స్ (మెదడువాతం) పెరుగుతున్నా యని షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సిహెచ్ విజయ్ తెలిపారు. ఈ వ్యాధిపై అవగాహన ఏర్పడినప్పుడే ఆదిలోనే గుర్తించి చికిత్స చేయవచ్చని సూచించారు.

ఒకప్పుడు 60ఏళ్లు దాటిన వారికి మాత్రమే వచ్చే ఈ వ్యాధి, ఇపుడు అన్ని వయస్సులకు వారికి వస్తోందన్నారు. మస్తిష్క రక్తనాళాల్లో వైఫల్యం కారణంగా రక్తం గడ్డకట్టడం ద్వారా అవి పూర్తిగా లేదా పాక్షికంగా మూసుకుపోతాయని, తద్వారా స్ట్రోక్‌కు కారణమౌతోందన్నారు. బయట ఆహారం, ముఖ్యంగా జంక్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఎక్కువ శాతం కొవ్వులు శరీరంలోకి చేరుతున్నాయని, ఇదే సమయంలో ఎలాంటి శారీరక వ్యాయామం లేకపోవడంతో అది అధిక బరువుకు కారణమౌతోందన్నారు. అధిక కొవ్వులతో ఊబకాయం, రక్తపోటు, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలకు కారణమై, చెడు కొలస్ట్రాల్ విపరీతంగా పెరగడంతో చివరకు బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణమౌతోందన్నారు. ప్రస్తుత కాలంలో పిల్లలు చదువులంటూ, పెద్దలు ఉద్యోగం, ఆఫీసులంటూ హడావిడిలో పడి శరీర ఆరోగ్యానికి కనీస సమయం కేటాయించడం లేదన్నారు

రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు 40 గ్రాములకు తగ్గకుండా చూసుకోవాలి. కనీసం 3-4 లీటర్లు నీళ్ల తాగాలి. విటమిన్ -డి, బి12లోపం వల్లకూడా శరీరంలో అమినో యాసిడ్స్ తగ్గి చివరకు బ్రెయిన్ స్ట్రోక్స్‌కు కారణమౌతాయన్నారు.

10లోగా 'పది' పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు ఈ నెల 28 నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉన్నట్టు పరీక్షల విభాగం సంచాలకులు దేవానంద రెడ్డి తెలిపారు. వచ్చే నెల 16లోగా రూ.50 అపరాధ రుసుంతోనూ, అలాగే వచ్చేనెల 22లోగా రూ.200 అపరాధ రుసుముతోనూ, వచ్చేనెల 30లోగా రూ.500 అపరాధ రుసుముతోనూ పరీక్ష ఫీజు చెల్లించవచ్చని సూచించారు.

కోర్టు ఆవరణలో మొక్కలు నాటివేత

ప్రజాశక్తి -గాజువాక : పర్యావరణ రక్షణ అందరి బాధ్యత అని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ జి షణ్ముఖరావు అన్నారు. శనివారం గాజువాక మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ, కమ్యూనిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ నగరీకరణ నేపథ్యంలో టెర్రస్ గార్డెన్స్‌కు ప్రాధాన్యత పెరిగిందన్నారు. అనంతరం గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెవి.స్వామి, న్యాయ మూర్తులతో కలిసి కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్ర బాబు, వై శ్రీలక్ష్మి, వై. ప్రేమలత, బార్ కార్యదర్శి బివిఎం.కృష్ణ, కోశాధికారి పల్లా శ్రీనివాసరావు, లోక్ అదాలత్ సభ్యులు కె.సీతామహాలక్ష్మి, ఆర్ సూర్యనారాయణ, ఎపిపి ఎం.పావని పాల్గొన్నారు..

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డు పరిధిలో శ్రీనివాసనగర్ ప్రాంతంలో సిసిరోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు జివిఎంసి ఫ్లోర్‌లీడర బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ప్రాంతంలో పర్యటన సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులకు మేరకు రూ.39.50లక్షల నిధులు మంజూరుచేసి, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు సమస్యలేవైనా ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీశ్, వార్డు నేతలు సీతారాం, శివ, కన్నప్పడు, పి.గోపి, వెంకటరావు, గంగా మహేష్, జక్కంపూడి సత్యనారాయణ, సత్తిబాబు, యం.రాంబాబు, కాయల రామారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కస్తూర్బా విద్యార్థినులు

ప్రజాశక్తి - భీమునిపట్నం : పాదచారులు, వాహన దారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం సూచించారు. శనివారం స్థానిక కెజిబివి విద్యార్థినులకు రహదారి నిబంధనలపై ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోజు రోజుకూ ఆందోళనకరస్థాయిలో పెరుగుతోన్న వాహన ప్రమాదాలు ఎన్నో కుటుంబాల్లో తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్న విషయాన్ని గుర్తెరిగి, ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపల్ గంగాకుమారి అధ్యక్షతన జరిగిన సదస్సులో అధ్యాపకులు పావని, ఆర్.కీర్తి, కె.యశోద, కుసుమ కిరణ్, గ్రీన్ క్లైమేట్ వాలంటీర్లు రాజేశ్వరి, రవితేజ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ధర్నా



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

మునిసిపల్ అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు మాట్లాడుతూ, ఆప్కాస్‌లో చేర్చిన ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేస్తామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దాన్ని నిలుపుకోలేదన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టో సమయంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, దానిని కూడా అమలు చేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సుమారు 40 వేల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు 20 నుంచి 25 ఏళ్లగా నామమాత్రపు జీతాలతో పని చేస్తున్నారని, వీరికి ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పేస్కేల్, కరువు భత్యం, ఇంటి అద్దె అలవెన్స్, ఇంక్రిమెంట్లు లేవని పేర్కొన్నారు. 60 సంవత్సరాలు నిండి విరమణ పొందిన కార్మికులకు గ్రాట్యుటీ ఇవ్వటం లేదని, పెన్షన్లు ఉండటం లేదని చెప్పారు. 5, 6 ఏళ్ల కోసారి నామమాత్రంగా జీతాలు పెంచుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిఒ 114 ప్రకారం 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసినా అందులో ఒక్కరు కూడా మున్సిపల్ కార్మికులు లేరని తెలిపారు. అప్కాస్ కార్మికులను రెగ్యులర్ చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సహాయ కార్యదర్శులు ఎంవి.ప్రసాదరావు, జె.నాయుడు, యుజిడి యూనియన్ అధ్యక్షుడు ఇ.ఆదినారాయణ, కె.కుమారి, క్లాప్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మున్సిపల్ పారిశుధ్య అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జివిఎంసి అనకాపల్లి జోన్ పరిధిలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేస్తానని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీ ఇచ్చి మేనిఫెస్టోలో చేర్చిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పుడు కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారని, అయితే ఔట్సోర్సింగ్ సిబ్బందిని పర్మనెంట్ చేయకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొమ్మల రాము, సత్యనారాయణ, పోలరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐటియు నేత శంకరరావు



నేవీ గోడ కట్టడానికి సిద్ధం చేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న నేతలు

జిరాయితీ భూముల్లో నేవీ గోడ కట్టడం అన్యాయం

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలోని పెదకలవలపల్లి గ్రామాన్ని ఆనుకొని జిరాయితీ భూముల్లో నేవీ అధికారులు ప్రహరీ నిర్మాణం చేయడం అన్యాయమని పెదకలవలపల్లి మాజీ ఎంపిటిసి రావి దేముడు, సిపిఎం మండల కన్వీనర్ జి దేముడునాయుడు అన్నారు. రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, ఇల్లు, కల్లాలు, జిరాయితీ భూముల్లో నుండి చేపట్టిన గోడ నిర్మాణ పనులను బాధితులు అడ్డుకున్నారు. శనివారం గోడ నిర్మాణ ప్రాంతాన్ని ఎంపిటిసి రావి దేముడు, దేముడు నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి చెట్లు, కల్లాలు, ఇల్లు నిర్మించుకొని, ఉపాధి పనులు చేసుకుని, పాడిపశువులు, గొర్రెలు మేకలు పెంచుకొని జీవనం సాగిస్తున్న బాధితులకు అధికారులు గాని, నేవీ వారుగాని ఎటువంటి సమాచారం ఏ విధంగా అక్రమ కడతారని ప్రశ్నించారు. ఇలా అయితే బాధితులు ఎలా బతకాలన్నారు. ప్రజలకు న్యాయం చేయవలసిన అధికారులు పాలకులు వారి జీవితాలు లాక్కోవడం అన్యాయమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ఈ విషయంపై వెంటనే స్పందించాలని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

తరచూ మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

గత కొద్ది కాలంగా ఆర్టీసీ బస్సులు తరచూ మరమ్మతులకు గురై, మొరాయిస్తుండడంతో ప్రధానంగా విద్యార్థులు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుచ్చయ్యపేట మండలం మీదుగా నర్సీపట్నం-చోడవరం బస్సులు, విశాఖపట్నం -పాడేరు బస్సులు, అనకాపల్లి-మాడుగుల, అనకాపల్లి -రావికమతం వయా రాజాం -తట్టబంద మీదుగా పలు బస్సులు నడుస్తున్నాయి. వారం పది రోజులుగా చోడవరం వడ్డాది మధ్య పలు బస్సులు మరమ్మతులకు గురై గౌరీపట్నం బొడ్డేరు వంతెన విజయరామరాజుపేటల వద్ద నిలిచిపోయాయి. అనకాపల్లి డిపోకు చెందిన పలు బస్సులు, పాడేరు డిపోకు చెందిన బస్సులు మరమ్మతుల గురయ్యాయి. అనకాపల్లి రాజాం రోడ్‌లో నడిచే పలు బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఆదివారం నర్సీపట్నం-చోడవరం మధ్య నడిచే బస్సు వడ్డాది వంతెన వద్ద మరమ్మతులకు గురైంది. కొండ్రం నీలకంఠాపురం మధ్య పలు బస్సులు మరమ్మతులకు గురై నిలిచిపోయాయి. మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు అనకాపల్లి, చోడవరం తదితర ప్రాంతాలకు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోనూ, ఇంటర్ డిగ్రీ తదితర ఉన్నత విద్యాభ్యాసానికి బస్సుల పైనే రాకపోకలు సాగిస్తున్నారు. మూడు నెలల సమయానికి సంబంధించిన బస్సు పాసులను తీసుకొని ప్రయాణిస్తున్నారు. మార్గ మధ్యలో బస్సులు మరమ్మతులు గురికావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో చోడవరం నుండి నర్సీపట్నం వెళ్లే బస్సులు, మాడుగుల వెళ్ళే బస్సుల్లో 100 మందికి పైగా విద్యార్థులు కిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో అనకాపల్లి నుండి రాజాం, తట్టబంద మీదుగా వెళ్లే బస్సుల్లోనూ ఫుట్పాత్ పై వేలాడు మరి ప్రయాణాలు సాగిస్తున్నారు. ఒక్కసారిగా బస్సులు మార్గ మధ్యలో మరమ్మతులకు తరచూ గురికావడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక బాల బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ బస్సులు మరమ్మతులు గురి కావడం ప్రయాణికులు ఇబ్బంది పడటం పరిపాటిగా మారింది. అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సులు మెయింటెనెన్స్‌పై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు

ఖోఖో పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కశింకోట : ఇటీవల చిత్తూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన జ్యోతి స్వరూప ప్రథమ స్థానం, భువనప్రియ ద్వితీయ స్థానం సాధించారు. వీరిని పాఠశాలలో శనివారం స్కూల్ కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ షాజిద, వ్యాయామ ఉపాధ్యాయుల సిహెచ్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

డైట్‌లో గ్లోబల్ ఛాలెంజ్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -అనకాపల్లి

స్థానిక డైట్ కళాశాలలో ప్రతిసంవత్సరం ప్రతిష్టాత్మకంగా జరిగే ఐ ట్రిపుల్ ఈ ఎక్స్‌ట్రీమ్ 17.0 - 24 గంటల గ్లోబల్ ఛాలెంజ్ ప్రోగ్రామ్ సభ్యుల బృందాలు శనివారం ప్రారంభించారు. ఇందులో స్టూడెంట్ సభ్యుల బృందాలు, ప్రోగ్రామింగ్ సమస్యల సమితిని 24 గంటల వ్యవధిలో పరిష్కరించడానికి ఒకదానితో ఒకటి ప్రపంచవ్యాప్తంగా పోటీ పడతాయని ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు తెలిపారు. ఈ ఛాలెంజ్లో డైట్ ఐ ట్రిపుల్ ఇ స్టూడెంట్ బ్రాంచ్ తరపున 27 బృందాలు పోటీలో పాల్గొన్నాయన్నారు. ఈ కార్యక్రమం 28 ఉదయం 5.30 నుండి ప్రారంభమై 29వ తేదీ ఉదయం 5.30 గంటలకు ముగుస్తుందన్నారు. ప్రోగ్రామింగ్ సమస్యల పరిష్కార విధానం ప్రకారం పాల్గొనే బృందాలకు పాయింట్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రతిసంవత్సరం తమ కళాశాల -విద్యార్థులు ఈ పోటీలో పాల్గొని ప్రపంచవ్యాప్తంగా ర్యాంక్లు కైవసం చేసుకుంటారని తెలిపారు. ఈ పోటీకి న్యాయనిర్ణేతలుగా హయ్యర్ గ్రేడ్ ఐ ట్రిపుల్ ఈ సభ్యులు వ్యవహరిస్తారని, పోటీలో పాల్గొనటానికి ఐ ట్రిపుల్ ఇ విద్యార్థులు విద్యార్థి సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ ఐ ట్రిపుల్ ఇ స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ డాక్టర్ పి.పూర్ణప్రియ, అకడమిక్ కోర్డినేటర్ కృష్ణనాగ్, డీన్ డాక్టర్ పార్వతి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘానికి విరాళం

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రముఖ విద్యాసంస్థ ఏఎంఏఎల్ కళాశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్‌కు అనకాపల్లి పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కెపివి రమణయ్య 5000 రూపాయల విరాళాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రత్నకుమార్

ప్రజాశక్తి- కె.కోటపాడు

బాల్యవివాహాలను అరికట్టాలని చోడవరం 9వ అడిషనల్ జిల్లా జడ్జి కె.రత్న కుమార్ అన్నారు. మండలంలోని కెకె. అగ్రహారం గ్రామంలో శనివారం న్యాయ సలహాపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను గ్రామస్థాయిలోని అరికట్టాలన్నారు. బాల్యవివాహాలు జరిగినట్లయితే వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాల్యవివాహాలు జరుపుతున్న తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాలన్నారు. ఆ విధంగా చేస్తే ఏ ఒక్కరు బాల్య వివాహాలు చేయుటకు ప్రయత్నం చేయరన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసితో పాటు సంవత్సరంలో మూడు లక్షల ఆదాయం సంపాదించేవారు ఉచితంగా న్యాయ సలహాలు పొందవచ్చన్నారు. కేకే అగ్రహారం గ్రామంలో ఎటువంటి వివాదాలు గాని, కోర్టు కేసులు కాని లేవని ఆ గ్రామస్తులను అభినందించారు. ఇంకొక రెండు నెలలు ఎటువంటి పోలీస్ కేసులు కానీ. కోర్టు కేసులు గాని లేకపోతే ఆ గ్రామాన్ని శాంతియుత గ్రామంగా ప్రకటిస్తామన్నారు. అనకాపల్లి ఆర్డీవో చిన్ని కృష్ణ మాట్లాడుతూ ఆ గ్రామంలో ఇప్పటివరకు 292 మంది రైతులకు భూమి పట్టాదార పాస్ పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. మండలంలో మూడో విడతలో రీ సర్వే వేగవంతంగా జరుగుతుందన్నారు. రీ సర్వే వల్ల రైతులకు సంపూర్ణ భూ హక్కు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జి స్వర్ణ, సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, న్యాయవాదులు కాండ్రేగుల డేవిడ్, ఎంపీడీవో కాండ్రేగుల శశిదేవి, డిప్యూటీ తహశీల్దార్ రమేష్ బాబు, స్థానిక ఎస్సై ధనుంజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -అనకాపల్లి

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డాక్టర్ రాజ్ ప్రేమ్, సిబ్బంది సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ, నర్సీపట్నం సబ్ డివిజన్ అదనపు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా స్వయంగా రక్తదానం చేసి పోలీసు అధికారులకు, సిబ్బందికి స్ఫూర్తి నింపారు. ఈ శిబిరంలో పోలీసులు, ప్రజలు 51 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ రక్తదానం మరో మనిషికి ప్రాణదానమని, ప్రమాదాలు సంభవించినప్పుడు, అత్యవసర శస్త్ర చికిత్సలు చేసేటప్పుడు రక్త నిల్వలు ఎంతో అవసరమని తెలిపారు. ఎటువంటి అపోహలకు తావులేకుండా ఆరోగ్యవంతులైన వ్యక్తులు సంవత్సరం కాలంలో 4 సార్లు దానం చేయవచ్చన్నారు. రక్తదానం చేయడం వలన గుండె పోటు, క్యాన్సర్ తదితర వాటి నుండి రక్షణ లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, అనకాపల్లి డిఎస్పీ వి.సుబ్బరాజు, ఏఆర్ డిఎస్పీ పి.నాగేశ్వరరావు, డిఎంహెచ్ఓ డాక్టర్ హేమంత్, బ్లడ్ డొనేషన్ క్యాంప్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలాజీ, అనకాపల్లి టౌన్ ఎస్సైలు సత్యనారాయణ, సింహాచలం, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ, పోలీసు సిబ్బంది

కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట : వర్షాభావం వలన తీవ్ర కరువు ఛాయలు నెలకొన్న బుచ్చెయ్యపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్‌ఎన్.రాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రాజాంలో జనసేన మండల నాయకులతో కలిసి ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వర్షాలు లేక పంట భూములు బీటలు వారిపోయి వరి పంట ఎండిపోయిందని తెలిపారు. రైతులు పెట్టిన పెట్టుబడిని కూడా నష్టపోతున్నారన్నారు. చోడవరం నియోజకవర్గంలో వరి ఎక్కువ శాతం వర్షాధారంపై ఆధారపడి ఉండని, ఆయకట్టు సాగు విస్తీర్ణం చాల తక్కువ ఉండడం వలన రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని చెప్పారు. సత్వరమే ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు డివిఎస్ నాయుడు, తుమ్మపాల రమేష్ , మంత్రి నాయుడు, నమ్మి తాతాజీ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము పంపిణీ

ప్రజాశక్తి -వడ్డాది : ఇటీవల మరణించిన వడ్డాది పిఎసిఎస్ సభ్య రైతుల కుటుంబాలకు ఛైర్మన్ దొండా సన్యాసిరావు శనివారం బీమా పరిహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్య రైతులు మరణించిన వారి కుటుంబానికి పిఎసిఎస్ అండగా ఉంటుందని తెలిపారు. పదిమంది సభ్య రైతులు ఈ ఆర్థిక సంవత్సరంలో మృతి చెందగా, వారి కుటుంబాలకు దహన సంస్కారాల నిమిత్తం పిఎసిఎస్ నుండి ఒక్కొక్కరికి రూ.4వేలు చొప్పున నగదు అందజేశారు. అలాగే రూ.15వేలు చొప్పున బీమా పరిహారం కూడా డిసిసిబి నుండి మంజూరైందని పిఎసిఎస్ అధ్యక్షుడు సన్యాసిరావు తెలిపారు. సభ్య రైతులు 59ఏళ్ల లోపు వారికి రూ.30 వేలు, 60 పైబడిన వారికి రూ.15వేలు సహజ బీమా అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత వీర్ల సురేష్, పిఎసిఎస్ కార్యదర్శి శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న వెదురు కర్రలు సీజ్

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాలాబు సమీపంలోని రిజర్వు ఫారెస్ట్ నుంచి దేవరాపల్లికి అక్రమంగా వెదురు కర్రలు తరలిస్తున్న వ్యాన్‌ను ఉమ్మడి విశాఖ జిల్లా స్క్వాడ్ డిఎఫ్ఓ ఎం.సోమసుందరం, స్క్వాడ్ రేంజర్ డి.గంగరాజు గురువారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఈ విషయాన్ని స్క్వాడ్ రేంజర్ గంగరాజు శనివారం విలేకరులకు తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారంతో దేవరాపల్లి సమీపంలో కాపు కాశామన్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వస్తున్న వ్యాన్‌ను ఆపి సోదా చెయ్యగా అందులో 610 వెదురు కర్రలు అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. వ్యాన్‌ను సీజ్ చేశామని, వెదురు కర్రలు కొనుగోలు చేసిన వ్యక్తితో పాటు వ్యాన్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు.

అన్న సమారాధనకు పైలా విరాళం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కింతాడ పంచాయతీ పరిధి గొంపవానిపాలెం గ్రామంలో దేవీ నవరాత్రులు సందర్భంగా శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమంలో టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు పాల్గొని రూ.5000 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కింతాడ మాజీ సర్పంచ్ బండారు నరసింహనాయుడు, టిడిపి నాయకులు కన్నూరు సూర్యనారాయణ, పైల ముత్యాలునాయుడు, సింగన్నదొరపాలెం సర్పంచ్ వెలగల పైడం నాయుడు, బండారు సన్యాసి నాయుడు, బండారు మహేష్, పైలా రాజు, గొంప ముత్యాలు నాయుడు, గొంప అప్పలనాయుడు, రెడ్డి అక్కునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కళా వేదికను అభివృద్ధి చేయాలని నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలో 100 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి రావు గోపాలరావు కళాక్షేత్రం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని, దానిని అభివృద్ధి చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ప్రతినిధులు కళాక్షేత్రం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దీనిని అభివృద్ధి చేయడంలో మంత్రి గుడివాడ అమర్నాథ్, పార్లమెంటు సభ్యులు డాక్టర్ సత్యవతి తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఏడాది కాలంగా ఈ కళ్యాణ మండపం ప్రజలకు అందుబాటులో లేకుండా నిరుపయోగంగా పడి ఉందన్నారు. అనకాపల్లిలో అందరికీ అందుబాటు ధరలతో నగర నడిబొడ్డులో ఉన్న రావు గోపాల రావు కళామందిర్ ను చూస్తుంటే బాధనిపిస్తుందన్నారు. దీనిని ఉడా అధికారులతో మాట్లాడి పట్టణ ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో విల్లూరి పైడారావు, బొడ్డేడ అప్పారావు, డాక్టర్ చిన్ని యాదవ్, బొడ్డు సోమరాజు, బొబ్బిలి గోవిందరాజు, పల్లా సత్య అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలను మోసం చేసిన

వెలుగు, బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని ధర్నా



ఆందోళన చేస్తున్న బాధిత డ్వాక్రా మహిళలు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయితీలో నకిలీ డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి బ్యాంకు రుణాలు కాజేసిన వెలుగు, బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్లో ఎదుట సిపిఎం, ఐద్వా ఆధ్వర్యంలో బాధిత డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేశారు. అనంతరం ఇక్కడ నుండి డిఆర్‌డిఎ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ సత్యనారాయణపురం పంచాయితీలో గ్రూపు సభ్యులకు తెలియకుండా నకిలీ గ్రూపులను ఏర్పాటు చేసి అనకాపల్లి బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో సుమారు 75 లక్షల రూపాయలు, కొత్తూరు, పంచాయితీలో 2 గ్రూపుల ద్వారా మరో 30 లక్షలు రూపాయలు రుణాలు మంజూరు చేయించి బ్యాంకు అధికారులు, వెలుగు సిబ్బంది కుమ్మక్కై కాజేశారని తెలిపారు. ఈ వ్యవహారంలో వైఎస్ఆర్ క్రాంతి పథం (వెలుగు) సిబ్బంది పాత్ర, బ్యాంకు అధికారులు చేసిన ఈ స్కాం పై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా సభ్యులకు సంబంధం లేకుండా జరిగిన వ్యవహారంలో సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. ఐద్వా జిల్లా నాయకులు డిడి వరలక్ష్మి మాట్లాడుతూ ఇంతటి అవినీతి వ్యవహారం జరుగుతున్నా దీనిని పర్యవేక్షించాల్సిన మండల ఎపిఎం, సిసిలు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. వెలుగు జిల్లా ఉన్నత అధికారులు, పోలీసులు జోక్యం చేసుకొని మహిళలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, ఐద్వా నాయకులు జి.సుభాషిణి, నందిక నాగమణి, ఉపమాక లక్ష్మి, బోడి ఝాన్సీ, బొబ్బిలి గాయత్రి, నందిక విజయ, ఆకుల దేవ, ఉప్పాటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి కార్యాచరణతో ప్రజల్లోకి



మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి- సబ్బవరం

టిడిపి, జనసేన ఉమ్మడి కార్యచరణతో నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రజల్లోకి వెళ్లనున్నట్లు మాజీ మంత్రి, టిడిపి పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని ఇరువాడ జిఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన పెందుర్తి నియోజకవర్గ టిడిపి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన భవిష్యత్ చంద్రబాబు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఓట్లు చీలిపోకుండా చేసేందుకు టిడిపి, జనసేన ఉమ్మడిగా నవంబర్ ఒకటి నుండి 45 రోజుల పాటు ఇంటింటికి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బండారు అప్పలనాయుడు, గండి రవికుమార్, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, పీలా శ్రీనివాసరావు, వేగి పరమేశ్వరరావు, గండి ముత్యాలనాయుడు, పిబివిఎస్ఎన్ రాజు, కోటన అప్పారావు, బర్లికాన బాబురావు, వి.చిన్నారావు, బొండా సత్యారావు, రెడ్డి నారాయణరావు, మొల్లి ముత్యాల నాయుడు, దాసరి వెంకట రమణ, గొర్లి చైతన్య పాల్గొన్నారు.

వైసిపి గద్దె దిగడం ఖాయం

అనకాపల్లి : రానున్న ఎన్నికల్లో వైసిపి గద్దె దిగడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక విజయరామరాజు పేట మాధవ సదన్ హాల్లో శనివారం అనకాపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఇందులో పీలా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పట్ల రాష్ట్రంలో తీవ్రమైన వ్యతిరేకత ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నీల బాబు, సురేంద్ర, రత్నకుమారి, పోలవరపు త్రినాధ్, బొద్దపు ప్రసాదు, ధనాల విష్ణు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా స్థానిక కలెక్టరు కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణ కావ్యాన్ని రచించి మనకు అందించిన వాల్మీకి మహర్షి మహాజ్ఞాని, గొప్ప తాత్వికుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.వరాహ సత్యవతి, బీసీ సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి, ఏబీసీడబ్ల్యూవోలు కె.సురేష్ కుమార్, జి.నాగేశ్వరరావు, జి.ఎస్.ఎన్.మూర్తి, వాల్మీకి బోయ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో..

మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శాలను బోధించే రామాయణ మహా కావ్యాన్ని లిఖించి అందరి గుండెల్లో చిరస్థాయిగా ఆదికవి వాల్మీకి నిలిచిపోయారని ఎస్పీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలను వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, అధిరాజ్ సింగ్ రాణా, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎఆర్ ఇన్‌స్పెక్టర్ సతీష్, కె.కోటపాడు సిఐ తాతారావు, నర్సీపట్నం రూరల్ సిఐ రమణయ్య, నక్కపల్లి సిఐ అప్పన్న పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి వి.శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు నాగేశ్వరి మాట్లాడుతూ వాల్మీకి సంస్కృత భాషలో రామాయణాన్ని రాసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఓ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి జీవిత చరిత్ర గురించి పాఠకులకు వివరించారు.

నక్కపల్లి : ఆదికవి మహర్షి వాల్మీకి బోధనలు నేటి సమాజానికి మార్గనిర్దేశమని ఎంఈఓ నరేష్ అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శనివారం తెలుగు ఉపాధ్యాయులు ఎన్ఎస్ ఆచార్యులు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, వాల్మీకి రచించిన రామాయణం జీవన సంస్కారం నేర్పే మహా కావ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండలవిద్యాశాఖ సిబ్బంది ఝాన్సీ, శివ , జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని గ్రంథాలయాధికారిని పి.దమయంతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయిని ఎల్.శ్యామలాదేవి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభాకర్, పాఠకులు పాల్గొన్నారు.

గొలుగొండ : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎన్.రాజుబాబు ఆధ్వర్యంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాను, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని, సైబర్ క్రైమ్స్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కెవి.మురళీకృష్ణ స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణ శనివారం నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సి.ఆర్.పి.సి కేసులు, గంజాయి, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ ప్రపంచకప్ జరుగుతున్న నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్ ముఠాలు అమాయక ప్రజలను సులువుగా డబ్బు సంపాదించవచ్చనే ఆశ చూపి బెట్టింగ్‌లకు పాల్పడేటట్లు ప్రేరేపించడం వలన యువత ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. గేమింగ్ యాప్‌లు, పార్ట్ టైం జాబ్‌లు, టాస్కులు పూర్తి చేయాలని లింక్ పంపించి క్లిక్ చేసే విధంగా తదితర సైబర్ క్రైమ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రతిభ కనబరిచిన 40 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డ్‌తో సత్కరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.సత్యనారాయణ రావు, నర్సీపట్నం సబ్ డివిజన్ అదనపు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పీ వి.సుబ్బరాజు, దిశ డిఎస్పీ మళ్ల మహేశ్వరరావు, డి.టి.సి డిఎస్పీ పి.శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణ్ మూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, సతీష్, వెంకటరావు,ఎస్సైలు రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అమూల్ పాల రైతులకు బోనస్

ప్రజాశక్తి-కశింకోట : జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా అమూల్ డెయిరీకి పాలు పోసిన రైతులు 90 మందికి బోనస్ కింద 1,62,642 నగదు పంపిణీ చేసినట్లు కశింకోట పశు వైద్య అధికారి అల్ఫాన్స్ జార్జ్ శనివారం తెలిపారు. ప్రతి లీటరుకు 50 పైసలు చొప్పున బోనస్‌గా వేసినట్లు చెప్పారు. కొత్తపల్లి, బుచ్చెయ్యపేట, త్యేగాడ గ్రామంలో పాడి రైతులకు శనివారం పంపిణీ చేశారు.

సార్వత్రిక విద్యాపీఠం పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-కె.కోటపాడు : చదువును మళ్ళీ కొనసాగిద్దాం.. బంగారు భవిత నిర్మించుకుందాం అన్న నినాదంతో ఏపి సార్వత్రిక విద్యాపీఠం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, పలు రకాల వృత్తులు, వ్యాపార రంగాలలో ఉన్న వారు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల సభ్యులు తదితరులు దూర విద్యా విధానం ద్వారా చదువును కొనసాగించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కె.సత్యనారాయణ, డివిడి ప్రసాద్, స్టేట్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, జిల్లా కోఆర్డినేటర్ ఓ.కుమార్, ఏరియా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌కె.ఖాశిం పాల్గొన్నారు.

భూమి పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు భూ సురక్ష పథకంలో భాగంగా రీ సర్వే ద్వారా ప్రతి భూ యజమానికి ఉచితంగా పాస్ పుస్తకాలను సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో సత్యనారాయణ, గ్రామ పెద్దలు శరగడ భాస్కరరావు, కె.ఆదినారాయణ, ముల్లేటి రాజేశ్వరరావు పాల్గొన్నారు.



నీరు లేని రిజర్వాయర్

జలాశయంలో నీరు తగ్గుముఖం

ప్రజాశక్తి-చీడికాడ:వర్షాలు లేక పోవడంతో కోణం పంచాయతీ పాలవెల్లి జలాశయంలో నీరు నిలువలు బాగా తగ్గిపోయాయి. దీంతో జలాశయం దిగువ ఉన్న రైతులందరూ ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ పంట చేతికి వచ్చే దశలో నీరు పంటకు సమృద్ధిగా లభించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ నుండి కూడా నీరు అందక పోవడంతో రైతులు పంట చేతికి వస్తుందా లేదా అని దిగులుతో తలలు పట్టుకుంటున్నారు. పెట్టుబడులు పెట్టి తీరా పంటలు చేతికి రాకపోతే పరిస్థితి ఏమిటి అని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఎండిన జలాశయం

ఉపమాకలో అన్న సమారాధన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. శ్రీ సత్య దుర్గ యూత్ కమిటీ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు .

కొత్తలోసింగిలో జ్వరాలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని ఆర్ల పంచాయతీ కొండ శిఖర గ్రామమైన కొత్తలోసింగి గ్రామంలో పివిటిజి కొందు తెగ గిరిజనులు జ్వరాల బారిన పడ్డారు. గ్రామంలో 18 కుటుంబాలు 80 మంది జనాభా కొండ శిఖరంపై నివసిస్తున్నారు. గత వారం రోజుల నుండి జ్వరంతో బాధ పడుతున్నారు. కొండశిఖర గ్రామం నుండి బుచ్చింపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు కొండ దిగి డోలు మోసుకుని వెళ్లవలసిన పరిస్థితి ఉంది. అక్కడి నుండి ఏడు కిలోమీటర్లు ఆటోలపై వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. దీంతో వైద్య సదుపాయం అందకపోవడంతో అనేక మంది గిరిజనులు మంచాన పడ్డారు. రెండు వారాల క్రితం ఆరోగ్య కార్యకర్తలు మందులు ఇచ్చినా తగ్గక పోవడంతో దిక్కుతోచని స్థితిలో మంచంపైనే ఉన్నారు. గ్రామానికి చెందిన పాంగి వెంకట్రావు (69), గెమ్మెలి కొండలరావు(32), గెమ్మెలి లక్ష్మి(31), గెమ్మెలి కుమారి(25), తాంబెల నాస్రో(45), తాంబెల పద్మ(30), తాంబెల జోసెఫ్ (8)తో పాటు మరికొంత మంది జ్వరాలతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామ పెద్ద వెంకట్రావు కోరారు.



మంచంపై ఉన్న గిరిజనుడు

ప్రశ్నిస్తే కేసులు పెట్టడం అన్యాయం : పంచకర్ల



మాట్లాడుతున్న పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:ప్రజా వ్యతిరేక విధానా లను ప్రశ్నిస్తే ప్రభుత్వం కేసులు పెట్టడం, అరెస్టు చేయడం అన్యాయని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు తెలిపారు. శనివారం నర్సీపట్నం కృష్ణాపేలస్‌లో నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ సమావేశంకు హాజరైన ఆయన మాట్లాడుతూ, సిఎం జగన్ ఒక్క అవకాశం ఇవ్వమని చెప్పింది ప్రజల కోసం కాదని, ఆయన కోసమేనని ప్రజలకు అర్థమైందని విమర్శించారు. గతంలో రాజకీయ పార్టీల మధ్య ఎన్ని విభేదాలు ఉన్నా సోదరులుగా కలిసి ఉండే వారని, జగన్ మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత ప్రతిపక్షాలను శత్రువులుగా చూసే విధానం అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నర్సీపట్నం ఎమ్మెల్యే మెయిన్ రోడ్డు విస్తరణపై స్పష్టత లేకుండా ముందుకు వెళ తున్నారని ఆరోపించారు. రూ.160కోట్లతో మంజూరైన ఇంటింటికి కుళాయి ప్రాజెక్టు మధ్యలోనే ఆగి పోయిందన్నారు. ఈ నెల 31న విశాఖలో టిడిపి, జనసేన ఉమ్మడి సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మున్సిపాలిటీ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, పందూరు రాజారావు, మహిళా నాయకులు నందారావు అలివేలు మంగతాయారు, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నాయకులు నమ్మి రమణరాజు, కర్రి సంతోష్, కొండలరావు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -పాయకరావుపేట : స్థానిక మండల కాంప్లెక్స్‌లో తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే గొల్ల బాబురావు చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయం లేక రెవిన్యూ సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. డెక్కన్ కెమికల్ యాజమాన్యం సుమారు 50 లక్షలు వెచ్చించి తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో డెక్కన్ ప్రతినిధులు కేవీ లక్ష్మీపతి రాజు, వీరారెడ్డి, సూర్యనారాయణ రాజు, ఆర్డీవో గోవిందరావు, జిల్లా వ్యవసాయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చిక్కాల రామారావు, జడ్పిటిసి లంక సూరిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గూటూరు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్, వైస్ ఎంపీపీ పల్లెల మణికంఠ స్వామి, ఉప సర్పంచ్ జత భవాని శ్రీను పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి రాంబాబు

కస్పాలో షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


ప్రజాశక్తి -వడ్డాది:బుచ్చెయ్యపేట మండలం వడ్డాది కస్పా రోడ్డులో రైతుల విశ్రాంతి నిమిత్తం షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జెడ్పీటీసీ నిధులు 4 లక్షలతో వడ్డాది, గౌరిపట్నం కస్పా రోడ్ లో రైతులకు, ప్రయాణికులకు రేకుల షెడ్ విశ్రాంతి భవనం నిర్మిస్తున్నామన్నారు. రైతులు పొలం లోకి వెళ్లి నప్పుడు ఎండకి, వర్షానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దిబ్బిడి సర్పంచ్ భాష, సీతాబుజ్జి, పోలేపల్లి ఎంపీటీసీ సీత సన్యాసి నాయుడు, యల్లపు విజయకుమార్, కోవెల ఈశ్వరరావు చినప్పనపాలెం సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దన్, బొబ్బరి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక వాసవి కళ్యాణ మండపం సంఘం, ఎఫ్ఎఫ్‌సి సంయుక్తంగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయమునకు రూ.24 వేల విరాళం అందించారు. ఆలయం అభివృద్ధి, పలు సేవా కార్యక్రమాల నిమిత్తం విరాళం ఇవ్వడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాలుమూరి జోగారావు, వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రావణ్, ఊడా రాము, దేవత కామేష్ పాల్గొన్నారు.

ఈ క్రాప్ జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని ఆర్ బి కె కేంద్రాల్లో ఈ క్రాప్ ముసాయిదా జాబితా ప్రదర్శిస్తున్నట్లు వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. శనివారం పలు ఆర్‌బికే కేంద్రాల్లో జాబితా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండ లంలో ఖరీఫ్ 2023 సంవత్సరానికి గాను 17077 ఎకరాలకు ఈ క్రాప్ నమోదు చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ పథకాలు రైతులకు వర్తింపు చేసేందుకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరి అని అన్నారు. ఈ క్రాప్ జాబితాను రైతులందరూ పరిశీలించి అభ్యంతరాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ బి కే సిబ్బంది, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.



జాబితాను ప్రదర్శిస్తున్న ఎఒ

పల్లెల్లో పేదలకు మెరుగైన వైద్యం

-పలు చోట్ల ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు



చిన్న బొడ్డేపల్లిలో పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలో చిన్న బొడ్డేపల్లి సచివాలయ పరిధిలో గ్రామస్తులకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసిల్దార్ జానకమ్మ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, సర్పంచ్ శివరాం, ఎంపీటీసీ సభ్యులు శ్రీను పాల్గొన్నారు.**నక్కపల్లి:**మండలంలోని దోసలపాడు గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్ల బాబురావు వైద్య శిబిరాన్ని, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పల్లెల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. అనంతరం గ్రామ నాయకులు ఎమ్మెల్యే బాబూరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి శ్రీనివాసరావు, వియ్యపు శ్రీనివాసరావు, పక్కుర్తి రమణ, గండేపల్లి ప్రకాష్‌రావు, చిన్నబ్బాయి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు .

రోలుగుంట: శరభవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వడ్డాది:బుచ్చెయ్యపేట మండలం మంగళాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ, గ్రామంలోనే ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను ధర్మశ్రీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంటే వెంకట పద్మ రేఖ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ రాధాలక్ష్మి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



మంగళాపురంలో స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

అచ్యుతాపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎలమంచిలి నియోజకవర్గంలో శనివారంతో ముగిసింది. నాలుగు మండలాల పరిధిలో 83 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే కన్నబాబురాజు చెప్పారు. మండలంలోని దుప్పితూరు గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించిన సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు రాజును సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దుప్పితూరు గ్రామ సర్పంచ్ దేశంశెట్టి శంకర్రావు, కే విమలా నాయుడు, కోన బుజ్జి, పి వాసు రాజు, నార్మల కుమార్, శనివాడ జవాల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార: 44వ వార్డు దాడి రామూర్తి కల్యాణ మండపంలోనూ, అలాగే 24వ వార్డు రేసపువానిపాలెం యుపిహెచ్‌సిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు పాల్గొన్నారు..ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, జెసిఎస్ కన్వీనర్ లజపతిరాయి, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, సాడి పద్మారెడ్డి, మండల కన్వీనర్లు జివి రమణి, బులుసు జగదీష్, మురళీకృష్ణరెడ్డి పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల వ్యాప్తంగా నిర్మిస్తున్న జగనన్న గృహాలు పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సూచించారు. శనివారం ఆమె మండలంలో పందూరు గ్రామంలో ఎస్సీ కాలనీ వద్ద నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా నిర్మిస్తున్న గృహాలు లేఔట్ల వద్ద సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వృధాగా ఉన్న లేఔట్ లో సమగ్ర వివరాలు తెలపాలని సూచించారు. పందూరు గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసిన లేఅవుట్ వద్ద లబ్ధిదారులకు నిర్మాణాలపై అవగాహన కల్పించి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జోష్ణ, సచివాలయ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన ఆర్‌టిసి ఉద్యోగుల దీక్ష

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: తొలగించిన ఉద్యోగుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని తిరిగి అదే డిపోలో ఉద్యోగాలు ఇవ్వాలని ఎన్ఎంయూ ఆధ్వర్యాన చేపడుతున్న ఉద్యోగుల నిరాహార దీక్ష శనివారం కొనసాంది. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, అనారోగ్య సమయంలో సెలవులను తప్పనిసరిగా ఇవ్వాలని, అన్ని కేటగిరీల ఉద్యోగులకు ఏఏఎస్, ఇంక్రిమెంట్లు పదోన్నతులు ఇవ్వాలని కోరారు. సంఘాల ప్రతి నిధుల పట్ల వివక్ష చూపడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధాకర్, డిపో కార్యదర్శి జి.ఎస్. నారాయణ పాల్గొన్నారు.

పోడు పట్టాలపై సమీక్ష

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పోడు వ్యవసాయం చేస్తున్న రైతులకు ఆర్ఓఎఫ్ ఆర్ పట్టాలు ఇచ్చేందుకు నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. నర్సీపట్నం డివిజన్ పరిధిలోని పోడు వ్యవసాయం చేసుకుంటున్న కుటుంబాలను గుర్తించి వారందరికీ పట్టాలు ఇవ్వాలని వామపక్షాలు ఇప్పటికే అనేక మార్లు అధికారులను కలిశారు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న రైతులకు పట్టాలు ఇచ్చేందుకు లబ్ధిదారులు గుర్తించే పని వేగవంతం చేయాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ రాజారావు, నర్సీపట్నం రేంజర్లు పాల్గొన్నారు.

ఎస్ఐగా లక్ష్మణరావు

ప్రజాశక్తి - కొత్తకోట: కొత్తకోట పోలీస్ స్టేషన్ ఎస్సైగా జీ.లక్ష్మణరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో డిసీఆర్బిలో ఇంతవరకు విధులు నిర్వహించిన ఆయన కొత్తకోట ఎస్సైగా బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన విభూషణరావు నక్కపల్లి స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో లక్ష్మణరావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మణరావు మాట్లాడుతూ, అసాంఘిక కార్యక్రమాల నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు చేపడతానన్నారు.

'జల జీవన్'పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నక్కపల్లి :మండలంలోని పెదబోదిగల్లం గ్రామంలో జల జీవన్ మిషన్ పనులకు ఎమ్మెల్యే గొల్ల బాబురావు శనివారం శంకుస్థాపన చేశారు .ఇందుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి కులాయి ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మున్నిషా బీబీ, వైసిపి పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, నాయకులు గొర్ల విజయ నాగపలరాజు ,తదితరులు పాల్గొన్నారు .

అనుమతితోనే పడవలు నడపాలి

ప్రజాశక్తి-గొలుగొండ:తాండవ రిజర్వాయర్‌తో పాటు ఇతర చెరువుల్లో అనుమతి ఉన్న వారు మాత్రమే బోటులను, పడవలను నడపాలని గొలుగొండ ఎస్సై నారాయణరావు మత్స్యకారులకు సూచించారు. ఈ మేరకు తాండవ మత్స్యకార సంఘం అధ్యక్షులు నక్కా రమణ సమక్షంలో సాలికమల్లవరం, పొగచెట్లపాలెం, వెంకటాపురం, అమ్మపేట గ్రామాలకు చెందిన పలువురు మత్స్యకారులకు నోటీసులను అందజేశారు. తాండవ రిజర్వాయర్, చెరువులలో అనుమతులు ఉన్న వారు అనువజ్ఞులైన వారే బోటులను నడిపి చేపలు పట్టుకోవాలే తప్పా మరే ఇతర కారణాలతో రిజర్వాయర్, చెరువుల్లో ప్రవేశించరాదన్నారు. ప్రస్తుతం తాండవ నీటి పరిమాణం ఎక్కువగా ఉందని, పర్యాటకులను పడవల్లో తీసుకు వెళ్లరాదన్నారు.



నోటీసులు ఇస్తున్న ఎస్ఐ

సాధికారత లేని రాజకీయ యాత్ర



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

సామాజిక సాధికార యాత్ర పేరుతో ఎన్నికల ప్రచార యాత్ర కాస్త ముందుగానే వైసిపి ప్రారంభించింది. గడచిన కాలంలో అమలుచేసిన పథకాలను వివరించి, ప్రధాన ప్రతిపక్షంపై విమర్శలు చేసి రాబోయే ఎన్నికల నాటికి తమ పార్టీకి అనుకూలంగా ఓటర్లను మలచుకొనే పని ఆరంభించింది. ఉత్తరాంధ్రలో సాగనున్న సాధికార యాత్ర శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రారంభించింది. యాత్ర కొనసాగుతున్న పద్ధతి సాధికారత, సామాజిక ప్రయోజనం కంటే రాజకీయ లబ్ధికి పడుతున్న తాపత్రయం ఎక్కువగా కనబడుతోంది. అధికార వైసిపి చేపట్టిన యాత్ర ప్రజల విశ్వాసం, నమ్మకం పొందాలంటే ప్రచారయాత్రగా కాకుండా గత ఎన్నికల్లో స్థానిక సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు నేరవేర్చిందో చెప్పాలి. చెప్పేలా ప్రజల నుంచి ఒత్తిడి రావాలి. పెరగాలి. ఒక్కో ప్రాంత భౌగోళిక పరిస్థితిని బట్టి సమస్య, దాని తీవ్రత, ప్రజల అవసరం మారుతుంది. ఆ అవసరాల కేంద్రంగానే గత ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీల్లో ఎంతవరకు అమలయ్యాయో, ఎన్ని కార్యరూపం దాల్చాయో, ఎందుకు అమలుచేయలేకపోయామో, తమ పాలన కాలంలో ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న హామీ ఏమైంది? వివిధ ఉద్యోగాల భర్తీకి ఎన్ని నోటిఫికేషన్లు విడుదల చేసింది? ఎన్ని పోస్టులు శాఖల వారీగా భర్తీచేసింది? సాగునీటి ప్రాజెక్టులకు చేసిన ఖర్చెంత? కొత్తగా ఎంత ఆయకట్టుకు నీరు అందించింది? జిల్లాల వారీగా శ్వేతపత్రం విడుదల చేయాలి. సాధించిన సాధికారత ఫలితాలు శ్వేతపత్రంలో తెలియజేయాలి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన మోడీ ప్రభుత్వంపై మమకారం ఎందుకు ప్రదర్శించాల్సివస్తుందో చెప్పాలి. అప్పుడే ఈ యాత్రకు నైతికత, విలువ ఉంటుంది.

గత ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తిచేస్తామని ఇచ్చిన హామీ అమలుకు అడ్డమెవరెచ్చారో ప్రజలకు సవివరంగా చెబితే ఈ ప్రభుత్వం ప్రజల పట్ల ఎంత జవాబుదారీతనంగా ఉందో అర్ధమవుతుంది. మూతపడ్డ తుమ్మపాల సహకార చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరించకుండా అమ్మకానికి ఎందుకు పెట్టదలుచుకుందో, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్‌ను ఎందుకు నిలిపివేయాల్సివచ్చిందో, సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరించి వాటి క్రషింగ్ సామర్ధ్యం పెంచుతామని చెప్పి పనికిరాకుండా ఎందుకు చేసిందో సామాజిక సాధికారత యాత్రలో ప్రభుత్వ పెద్దలు, పార్టీ నాయకులు సిగ్గుపడకుండా చెప్పాలి. నల్ల బెల్లంపై ఆంక్షలు ఎత్తివేసి, బెల్లానికి పూర్వవైభవం తీసుకొస్తామని, అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రానికి నిధులు కేటాయించి బలోపేతం చేస్తామని, పాడి రైతుకు లీటర్ పాలుకు ప్రోత్సాహకంగా రెండు రూపాయలు చెల్లిస్తామని, కాలుష్య నియంత్రణ, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని, ఎన్ఎఒబి, ఫార్మా, సెజ్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని, వరదలకు గ్రామాలు మునిగిపోకుండా శారద, వరహా నదులకు రెండువైపులా రక్షణ గోడ నిర్మిస్తామని, నాన్ షెడ్యూల్ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించి, గిరిజనులకు భూమి పట్టాలు అందిస్తామని ఇచ్చిన మాట ఈ ప్రభుత్వం ఎందుకు నిలబెట్టుకోలేకపోయిందో చెప్పేలా ప్రజలు నిలదీయాలి. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలన్న జిఒ అమలుకు ఉన్న అవరోధాలేంటో వివరించినప్పుడే సాధికారత యాత్రకు ఫలితముంటుంది. లేదంటే ప్రచారయాత్రగానే భావించి నివృత్తిచేయలేని, పరిష్కారం చూపలేని సమస్యలపై ప్రజలు ఓ పరిష్కారం కోసం వేచిచూస్తారు. అదునుచూసి ప్రభుత్వానికి తగిన పాఠం చెబుతారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:సిఎం జగన్ రెడ్డి యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. వ్యవసాయ క్షేత్రంలో శనివారం తెలుగుదేశం పార్టీ విస్తతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, ఈ సంవత్సరం రైతులకు గడ్డుకాలం ఏర్పడిందని, వర్షాలు లేక పంటలు దెబ్బతిన్నాయని ఈ మేరకు అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జగన్ రెడ్డి చేస్తున్న అరాచక పనులను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని బూత్ కన్వీనర్లకు సూచించారు. నియోజకవర్గంలో 12 వేల దొంగ ఓటర్లను చేర్పించారని, 17 వేల ఓటర్లను తొలగించినట్లు గుర్తించామని, వీటిపై రాష్ట్ర ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ప్రతి ఓటరు కూడా తమ ఓటు ఉందో లేదో ఆన్లైన్లో సరి చూసుకోవాలన్నారు. కుటుంబ సాధికారత భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ముస్లిం సోదరులకు, జర్నలిస్టులకు ఇల్లు ఇస్తానని చెప్పి మోసం చేసిన జగన్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. యువతకు ఉపాధి కల్పించే లులూ వంటి కంపెనీలు జగన్ రెడ్డి వల్లే పోయాయని విమర్శించారు. రాష్ట్రంలో ఇటువంటి కంపెనీలు ఉంటే యువతకు ఉపాధి కలిగేదని పేర్కొన్నారు. ఈ నాలుగు సంవత్సరాలలో రోడ్ల మరమ్మతు చేపట్టిన దాఖలాలు లేవన్నారు.

టిడిపి నేతల నిరసన



నక్కపల్లిలో నిరసన తెలుపుతున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని గొడిచెర్లలో శనివారం బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు పై పెట్టిన అక్రమ కేసులపపై నిరసన చేపట్టారు. కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామంలో క్లస్టర్ ఇన్చార్జి వైబోయిన రమణ ఆధ్వర్యంలో బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లి : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక గవరపాలెం పార్క్ సెంటర్లో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబును రాజమండ్రి జైల్లోనే తుదముట్టించేందుకు జగన్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. 50 రోజులుగా జైల్లోనే ఉన్న చంద్రబాబుకు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టుతున్నా, ఆ విషయాన్ని బయట పెట్టకుండా అంతా బాగున్నట్టుగా డాక్టర్లపై ఒత్తిడి చేసి వాస్తవ రిపోర్టులను దాచిపెడుతున్నారని ఆరోపించారు. సకల శాఖామంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి దర్శకత్వంలోనే నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోడి వెంకట్రావు కుప్పిలి జగన్మోహన్, గుడాల సత్యనారాయణ, దాడి అప్పారావు పాల్గొన్నారు.



మూసివేస్తున్న అర్చకులు, సిబ్బంది

వెంకన్న ఆలయం మూసివేత

తలుపులు మూసివేస్తున్న అర్చకులు, సిబ్బంది

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయాన్ని పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆలయ అర్చకులు మూసివేసారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు మాట్లాడుతూ, శనివారం రాత్రి ఒంటి గంట మూడు నిమిషాల నుండి తెల్లవారితే ఆదివారం రెండు గంటల 22 నిమిషముల వరకు పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ఆలయం మూసి వేయడం జరిగిందన్నారు. ఆదివారం ఉదయం ఐదున్నర గంటలకు తిరిగి ఆలయం తెరుస్తామనన్నారు.భక్తులకు యధావిధిగా దర్శన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ,సిబ్బంది పాల్గొన్నారు .

ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ:మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యాన శనివారం మండలంలో సచివాలయాల వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో భాగంగా మండలంలో 244 విద్యార్థుల డేటాను పరిశీలించి నవంబర్ 4వ తేదీలోపు సంబంధిత ఎంఇఒ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ చుక్కల సత్యనారాయణ, రాయపురెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.